క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో పోషకాలు లభిస్తాయి



బర్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీమాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్)వలన ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు భూమికి లభిస్తాయని ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు రైతులకు అవగాహన కల్పించారు. బర్లి రైతు సేవా కేంద్రంలో బర్లి, మిర్తివలస రైతులకు వ్యవసాయ సాగుపై గురువారం అవగాహన కల్పించి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ శ్రీనివాసరావు, యంగ్ ప్రొఫెషన్ రవితేజ, ఏఈవో చాందిని, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ



ఎరువులను పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతు నాయకులు

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు ఏవో ఎస్.అవినాష్ అన్నారు. లచ్చయ్యపేట, పెదబోగిలి, నిడగల్లు రైతు సేవా కేంద్రాల్లో గురువారం సిబ్బంది సహకారంతో డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని ఖరీఫ్ సీజనులో వరి, చెరకు, పామాయిల్, పత్తి సాగు భూములకు అవసరమైన వివిధ రకాల ఎరువులు అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో బోల్తా పడిన ఆటో

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారులో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆగి వున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బలంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొట్టి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లో పడింది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసినప్పటికీ త్రుటిలో ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయట పడ్డారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

సీతానగరం: ప్రజల సమస్యలు పరిష్కరించడానికే సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం బూర్జలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు టీడీపీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శిలు పి.సత్యన్నాయుడు, ఆర్.వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కాటన్ సంచులే మేలు



కాటన్ సంచులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు జయ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నిషేధిత పాలిథిన్ కవర్లు వాడకుండా కాటన్ సంచులే వినియోగించాలని కురుపాం తహసీల్దారు జయ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బందితో పాటు అక్కడకు వచ్చిన పలువురికి కాటన్ సంచులు గురువారం పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, పాలిథిన్ కవర్ల వినియోగానికి స్వస్తి పలకాలని తహసీల్దారు పిలుపునిచ్చారు. యస్ స్పొసైటీ సహకారంతో అందజేస్తున్న ఈ గుడ్డసంచులను వినియోగించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. బియ్యాలవలస, రస్తాకుంటుబాయి, గొటివాడ పంచాయతీల్లో నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని సొసైటీ కార్యదర్శి ఎస్.కె గౌస్ తెలిపారు. కార్యక్రమంలో బియ్యాలవలస మాజీ సర్పంచ్ పువ్వల పత్తి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందేనా..!

- ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆందోళన
- పాలకులకు పట్టని అన్నదాత అవస్థలు

బలిజిపేట:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమయింది. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత వేధిస్తోంది. రైతు సేవా కేంద్రాలకు ఒక్క ఎరువు బస్తా కూడా చేరలేదు. గత ప్రభుత్వ హయాంలో మే నెల చివరిలోపే రైతు భరోసా కేంద్రాలకు కాంప్లెక్స్ ఎరువులను తరలించి పుష్కలంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టేది. మండలంలో ఖరీఫ్ సీజనుకు మొదటి విడతగా యూరియా, డీఏపీ ఎరువులు ఎక్కువగా అవసరం ఉంటుంది. మండలంలో 20 సచివాలయాల పరిధిలో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటికి ఎరువులు సంపూర్ణంగా రాకపోవడంతో రైతులు మండల కేంద్రాలకు పరుగులు పెట్టి పడిగాపులు పడి ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేద్దామన్నా వారి వద్ద కూడా ఎరువులు దొరకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

యూరియా మార్కెట్‌లో లభించడం క్లిష్టతరమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో ఎరువులకు డిమాండ్ ఉంటుందనేది తెలిసిందే. అయితే అన్నీ తెలిసిన ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో తీవ్రంగా కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. రైతుల అవసరాలకు సరిపడ నిల్వలను తెప్పించడంలో సర్కారు విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రైవేటు డీలరు వద్ద కానరాని యూరియా

మండలంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం	:	21వేల ఎకరాలు
సాగు రైతులు	:	తొమ్మిది వేల పైబడి
ఇండెంట్ పెట్టిన యూరియా	:	240 టన్నులు
ఇప్పటి వరకు వచ్చింది	:	100 టన్నులు

యూరియా అమ్మలేమంటున్న డీలర్లు

యూరియా అమ్మకాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు ఎరువుల దుకాణ యజమానులు చెబుతున్నారు. యూరియా కొనుగోలు సమయంలో నానో వంటి అదనపు వస్తువులు కొనుగోలు చేయాలని కంపెనీలు ఒత్తిడి చేస్తుండడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్టు పేర్కొంటున్నారు. యూరియా బస్తాతో పాటు అదనపు ఎరువు, మందు కొనుగోలు చేయాలంటే రైతులు అధిక మొత్తాలు పెట్టి కొనాల్సి వస్తుందని అందుకు రైతులు నిరాకరించడం, తెచ్చిన యూరియాను ఉంచలేక బస్తాలను ఇస్తే షాపుల్లో వచ్చినవి నిరుపయోగంగా ఉండిపోయి నష్టపోతున్నందున యూరియా అమ్మలేమని డీలర్లు చేతులెత్తేశారు. దీంతో యూరియా కొరత తీవ్రంగా కనిపిస్తుంది.

యూరియా కొరత లేకుండా చేస్తాం..

మండలంలో రైతు సేవా కేంద్రాలకు రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో యూరియా వస్తుంది. ఖరీఫ్‌లో యూరియా కొరత లేకుండా చూస్తాం. ప్రైవేటు డీలర్లను యూరియా తీసుకురావాలని కోరాం. రైతులు ఆందోళన చెందనక్కర్లేదు. ఖరీఫ్ సీజన్ ముందుగా రావడం, ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో యూరియా సకాలంలో అందుబాటులోకి రాలేదు.

– శ్రావణ్‌కుమార్, ఏవో, బలిజిపేట

అభివృద్ధి చేయలేక.. అభాండాలు వేస్తున్నారు..!

- కూటమి పాలకులపై సర్పంచ్‌ల ధ్వజం



మాట్లాడుతున్న సర్పంచ్‌లు

సాలూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా.. అభివృద్ధి చేయలేక పాలకులు ప్రతిపక్షంపై అభాండాలు వేస్తున్నారని.. ఇది ఆడలేక.. మద్దిలోడు... చందంగా ఉందని శివరాంపురం, పురోహితునివలస సర్పంచ్‌లు జె.మోహన్, బి.లక్ష్మణరావు మండిపడ్డారు. పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో వారు గురువారం మాట్లాడారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభివృద్ధిని విస్మరించి అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. శివరాంపురంలో బుధవారం నిర్వహించిన ఇంటింటికి టీడీపీ – సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి స్థానిక సర్పంచ్‌పై చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. శివరాంపురంలో అభివృద్ధికి సర్పంచ్ ఆటంకంగా మారారని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పారన్నవలస పంచాయతీలో ఆమె చేసిన అభివృద్ధి ఏంటో తెలిపాలన్నారు. ఇచ్చిన వర్క్ ఆర్డర్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్న కూటమి పాలకులు నీతి మాటలు కట్టిబెట్టాలన్నారు. శివరాంపురం బ్రిడ్జి నిర్మాణం కూటమి పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు.

శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాల్లో జగన్నాథుడు



బలిజిపేట: గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు



పార్వతీపురం టౌన్: రామావతారంలో జగన్నాథుడు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు గురువారం స్వామివారిని శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆర్.పార్థసారధి ఆచార్యులు, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజా కార్యక్రమాలు జరిపారు. ధూప దీప నైవేద్యాలతో స్వామివారికి పూజలు జరిపిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 7గంటల వరకు లక్ష్మీదేవి పిలుపు అనే సేవను నిర్వహించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు.

రామావతారంలో జగన్నాథుడు

పార్వతీపురం టౌన్: జగన్నాథస్వామి రథోత్సవాల సందర్భంగా స్వామివారు ఏడవ రోజు శ్రీ రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆలయ అర్చకులు శశిభూషణ్ పండా, రవీంద్ర పండాలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో బారులు దీరారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మక్కువ: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణకు ఆశ వర్కర్ల సమస్యలపై గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం వల్ల ఉద్యోగ భద్రతకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, పని దినాలు తగ్గించాలన్నారు. ఈ కోడ్‌లు, కార్మికుల సమస్యలతో పాటు మండల స్థాయిలో అన్ని సమస్యలు పరిష్కరించుకునే విధంగా సార్వత్రిక సమ్మెలో ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు అనిత, మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు పవన్ పాల్గొన్నారు.



వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశ వర్కర్లు

ఒప్పందాలు అమలు చేయకుంటే మరో పోరాటం



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిక

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం గతంలో మున్సిపల్ కార్మికులు 17 రోజులు సమ్మె సందర్భంగా మున్సిపల్ పరిపాలన అధికారులు కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని లేకుంటే మరో పోరాటానికి కార్మిక వర్గం సిద్ధపడుతుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ హెచ్చరించింది. మున్సిపల్ కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పురపాలక సంఘం కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు వి.సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం తరఫున అధికారులు చేసుకున్న మినిట్స్, ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, అంతవరకూ 60 సంవత్సరాలకు రిటైర్ అవుతున్న వారికి నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాలకు ఇచ్చే మట్టి ఖర్చులు పెంచి ఇస్తామన్న జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పురపాలక సంఘంలో పెరిగిన ప్రజలకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధపడతామని దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల, మూల్యాంకన విధుల రెమ్యునరేషన్ చెల్లించాలి

పార్వతీపురం టౌన్:

పదవ తరగతి 2025 వార్షిక పరీక్షలు, ప్రశ్నపత్రాల మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. విధులు నిర్వహించి 2, 3 నెలలు గడిచినా ఇంకా రెమ్యునరేషన్ చెల్లించకపోవటం సరికాదని, వీటి కోసం ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని అందువలన తక్షణమే వారికి రెమ్యునరేషన్ చెల్లించాలని ఆయన కోరారు. ఇంకా ఆలస్యం అయితే ఆందోళన చేపడతామని తెలియజేశారు. జిల్లాలో కొన్ని చోట్ల క్లస్టర్ పాఠశాలల కూర్పు, క్లస్టర్ ఖాళీలకు ఉపాధ్యాయుల కేటాయింపు అశాస్త్రీయంగా జరిగిందని, దీనిని సరి చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

సర్పంచ్‌లకు శిక్షణ

పార్వతీపురం రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో రెండో విడత సర్పంచ్‌ల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని పార్వతీపురం ఎంపీడీవో జి.రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. రెండో విడతలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, కొమరాడ మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు పంచాయతీ పరిపాలనలో సాధికారత సాధించడానికి నైపుణ్యాలను బోధిస్తారని తెలిపారు. శిక్షణ తరగతులు మహిళా సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.రమణమూర్తి, ఆయా మండలాలకు చెందిన ఎంపీడీవోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

• అడుగుకో గుంత..



కవిరిపల్లి రహదారి దుస్థితి



కాకువానివలస: చెప్పులు చేతపట్టి కాలినడకన పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మక్కువ మండలంలో ఏ రహదారి చూసినా అడుగుకో గుంత లెక్కన దర్శనమిస్తున్నాయి. చివరకు కాలికి వేసుకున్న చెప్పులు సైతం చేత పట్టుకుని రహదారులపై నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రహదారుల నడక నరకయాతనగా ఉంటే.. వాహనదారులకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. మక్కువ మండలంలో లోవరఖండి, సరాయివలస, తెలగడవలస, కవిరిపల్లి, కాకువానివలస తదితర గ్రామాల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రహదారుల్లో చిన్నపాటి వర్షాలకే నీరు గుంతల్లో చేరి ప్రమాదాలు తెచ్చి పెడుతున్నాయి.

– మక్కువ

ఇవేమి.. రహదారులు!

పార్వతీపురం రూరల్:

జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన గ్రామాల్లో ఎక్కువ శాతం గ్రామాలు నేటికీ రహదారి సౌకర్యం లేక ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని, కొన్ని ప్రాంతాల్లో నిర్మాణం చేసిన రోడ్లు మూనాళ్ల ముచ్చటకే పరిమితమై నాసిరకమైన పనులతో శిథిలావస్థకు చేరాయని సీపీఎం నాయకుడు పి.రాము అన్నారు. పార్వతీపురం మండలంలోని పలు గిరిజన గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో ఉన్న రోడ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తెలినాయుడువలస నుంచి గంజిగెడ్డ గ్రామానికి వెళ్లేందుకు గిరిజనులు అవస్థలు ఎదుర్కొంటున్నారని, అత్యవసరమైన పరిస్థితుల్లో కూడా బయటకు వచ్చేందుకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చినబొండపల్లి, కొత్తపట్నం, వెంకంపేట గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కొరాపుట్ అంతర్రాష్ట్ర రహదారి దారుణంగా గుంతలమయం అయ్యిందని పేర్కొన్నారు. చినబొండల్లి శివారులో జంఝావతి కాలువపై ఉన్న బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడి భయాందోళనలు కలిగిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన గుమ్మలక్ష్మీపురం మండలంలో, పార్వతీపురం మండలంలో ములగ నుంచి డోకిశీల వరకు నిర్మాణం చేసిన రహదారులు శిథిలావస్థకు చేరాయన్నారు.



అధ్వానంగా ఉన్న గంజిగెడ్డ గ్రామానికి వెళ్లే రహదారి

మలేరియా, డెంగీ వ్యాధులపై తస్మాత్..

సీతంపేట: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బిబి.మిశ్రో అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో భామిని, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ పరిధిలోని పీహెచ్‌సీల హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మలేరియా పాజిటివ్ కేసులు వస్తే ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు రక్తపరీక్షలు చేయాలన్నారు. స్ప్రేయింగ్ చేయించాలన్నారు. అందుబాటులో మందులు ఉంచుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో డెంగా మాసోత్సవ ర్యాలీలు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మిశ్రో

చదువుతో పాటు భద్రత ముఖ్యం

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టి

పాచిపెంట: విద్యార్థినిలకు చదువుతో పాటు వారి భద్రత కూడా ముఖ్యమని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టి అన్నారు. మండలంలోని పి.కోనవలస గిరిజన ఆశ్రమ బాలికల కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శక్తి యాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని శక్తి యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినిలు తమ గ్రామాల్లో ప్రజలకు సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. యుక్త వయసులో ప్రేమ ఆకర్షణలో పడి మోసపోతూ విద్యకు దూరమై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిల భద్రత పట్ల ఉపాధ్యాయ సిబ్బంది, కళాశాల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరుల నుంచి విద్యార్థినిలకు ఎటువంటి అసౌకర్యం కలిగినా స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు. తాను కూడా సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివి ఐపీఎస్ సాధించానని గుర్తు చేశారు. ఈ కళాశాల విద్యార్థులు కూడా ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్స్ వంటి ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన పరీక్షల్లో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థినిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత్ సూరణ, కళాశాల ప్రిన్సిపాల్ భవాని, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి సన్మానిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ, ఎస్పీ, ఏఎస్పీ

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పాచిపెంట: పి.కొనవలస చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. మండలంలోని పి కోనవలస చెక్‌పోస్ట్ ను పార్వతీపురం ఎస్పీ మాధవరెడ్డితో కలిసి సందర్శించారు. వాహన తనిఖీలు ఏ రకంగా నిర్వహిస్తున్నారని పోలీస్ సిబ్బందిని ఆరా తీశారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు.